

# కౌంటింగ్ హాళ్లను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

రాయలసీమ యూనివర్సిటీలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పరిశీలించారు. యూనివర్సిటీలో ని కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్‌ను పరిశీలించిన అనంతరం అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి ఇవిఎమ్ యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్, లైఫ్‌సైన్స్, లైబ్రరీ బ్లాక్‌లను పరిశీలించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి టేబుళ్ల వారిగా రిజల్ట్స్ ప్రింట్ చేసి ఏజెంట్లకు ఇచ్చేందుకు గాను పెద్ద సైజులో ఉండే ఫోటో కాపీ మెషీన్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. వాటిని సీలింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మెయిన్ ఎంట్రెన్స్ గేట్ నుండి కేవలం అబ్జర్వర్లు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మాత్రమే రావాలని మిగిలిన వారందరూ బాయ్స్‌హాస్టల్ బ్యాక్‌సైడ్ నుండి రావాలన్నారు. కౌంటింగ్‌కు సంబంధించిన రిజర్వడ్ సిబ్బందిని లైబ్రరీ బ్లాక్ లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో కూర్చునే విధంగా 200 చైర్లు ఏర్పాటు చేయాలన్నారు. పాణ్యం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి, కర్నూలు నగర పాలక సంస్థ మునిసిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లాకళ్యాణి, డిఆర్ఒ మధుసూదన రావు, కోడుమూరు రిటర్నింగ్ అధికారి, కర్నూలు ఆర్‌డిఒ శేషి రెడ్డి, పత్తికొండ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ రామలక్ష్మి, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి, మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళి, ఆలూరు రిటర్నింగ్ అధికారి రామునాయక్, ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ నాగరాజు, టిడ్కో ఎస్ఇ రాజశేఖర్ పాల్గొన్నారు.

**ఇసి ఆదేశాలను సారం కౌంటింగ్ నిర్వహణ**

జూన్ 4న ఎన్నికల కమిషన్ ఆదేశాలనుసారం కౌంటింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్‌కు వివరించారు. ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుండి ఎన్నికల కౌంటింగ్, భద్రతా ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన మాట్లాడారు. మొత్తం 8 నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ కోసం రాయలసీమ యూనివర్సిటీలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బందిని గుర్తించి ర్యాండమైజ్ చేసి వారికి శిక్షణ కూడా ఇచ్చామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పూర్తి స్థాయిలో బ్యారికేడింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ... కౌంటింగ్ రోజున ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యాత్మక ప్రదేశాల్లో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేశామన్నారు.

నాగనాథనహళ్లి ఎస్ఎస్ ట్యాంకు డిజైన్‌లో...

# రాజకీయ జోక్యం...

- నీరుగారిన ఆశయం
- అధికారులపై ఒత్తిడి చేసి డిజైన్ మార్పు చేసిన ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి
- తాగునీరందక ఆస్పరి ప్రజల అవస్థలు
- నెలకోసారి తాగునీటి సరఫరా

**ప్రజాశక్తి - ఆస్పరి**

నాగనాథనహళ్లి ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణంలో రాజకీయ జోక్యం వల్ల ఆస్పరి మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డిజైన్‌లో లేని గ్రామాలను చేర్చడం వల్ల నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. నెలకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శిస్తున్నారు. కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర మాజీ మంత్రి మూలింటి మారెప్ప ఆస్పరి మండల ప్రజల దాహార్తిని తీర్చాలని 2006 ఆదోని మండలంలో 2, ఆస్పరి మండలంలో 6, ఆలూరు మండలంలో 7 గ్రామాలకు తాగునీరు అందించాలని రూ.12 కోట్లతో నాగనాథనహళ్లి ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేశారు. నాగనాథనహళ్లి ఎస్ఎస్ ట్యాంకు డిజైన్‌లో ఆదోని





నాగనాథనహళ్లి ఎస్ఎస్ ట్యాంకు

ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి జోక్యం చేసుకుని మార్పు చేయడంతో ఆస్పరి ప్రజలు దాహార్తి తీరక ఆశయం నీరుగారుతోంది. 15 గ్రామాలకు డిజైన్ చేసిన ఎస్ఎస్ ట్యాంకుకు ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మరో 7 గ్రామాలు చేర్చడంతో నీటి కొరత వేధిస్తోంది. నీటి కొరతతో పాటు అధికారులు, మెయింటెన్స్ కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వల్ల శివారు గ్రామాలైన చిరుమాన్ దొడ్డి, శంకరబండ, ఆస్పరి గ్రామాలకు నీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేజర్ పంచాయతీ ఆస్పరిలో నెలకోసారి కూడా నీరందని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

**రూ.12 కోట్లతో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం**

తుంగభద్ర ఎల్ఎల్‌సి కాలువకు అనుసంధానంగా బసాపురం గ్రామం వద్ద 12 ఎకరాల విస్తీర్ణంలో ఎస్ఎస్ ట్యాంకును 2006లో ఏర్పాటు చేశారు. మొదటగా ఈ ఎస్ఎస్ ట్యాంకు నుంచి ఆదోని మండలంలోని నాగనాథన హళ్లి, ఢణాపురం, నారాయణపురం, చాగి, మరకట్టు గ్రామాలకు నీరందించాలని జలాశయం నిర్మించారు. 15 గ్రామాలకు డిజైన్ చేసిన ఎస్ఎస్ ట్యాంకును ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి జోక్యం చేసుకొని ఆదోని మండలంలోని విరుపాపురం, గోనబావి, హువ్వనూరు, దిబ్బనకల్లు, సాదాపురం, కమ్మరచేడు తదితర గ్రామాలను చేర్చారు. ఎస్ఎస్ ట్యాంకు ద్వారా మొదట డిజైన్ చేసిన గ్రామాలకు పూర్తిస్థాయిలో నీరందించని పరిస్థితి ఏర్పడింది.

**ఆస్పరిలో నెలకోసారి తాగునీరు**

నాగనాథన హళ్లి ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉండడంతో ఆస్పరి గ్రామంలోని అన్ని వీధులకు నెలకోసారి కూడా తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గ్రామానికి నీటి సరఫరాను సక్రమంగా ఎందుకు చేయడం లేదని స్థానిక సర్పంచి రాధమ్మ అధికారులను ప్రశ్నిస్తే విద్యుత్ అంతరాయం, పైపులైన్ లీకేజ్ అంటూ కారణాలు చెబుతూ నీటి సమస్యను తీవ్రం చేస్తున్నట్లు తెలిసింది. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే గ్రామానికి నీటి సమస్య తీవ్రంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదోనిలోని గ్రామాలకు నీరు సక్రమంగా సరఫరా అవుతోంది. ఆస్పరి మండలంలోని గ్రామాలకు సరఫరా కాకపోవడంలో ఆంతర్యమేమిటో జిల్లా అధికారులు తేల్చాల్సి ఉంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆస్పరితో పాటు మరికొన్ని గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇని కలిసిన ప్రజాప్రతినిధులు**

నాగనాథన హళ్లి ఎస్ఎస్ ట్యాంకు నుంచి తమ గ్రామాలకు సక్రమంగా నీరు అందించాలని ప్రజాప్రతినిధులు కర్నూలు ఎస్ఇని కలిసి కోరారు. ఆస్పరి జడ్‌పిటిసి దొరబాబు, కెడిసిసి బ్యాంకు జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, బిణిగేరి సర్పంచి వెంకటేష్, ఎంపిటిసిలు రాధాకృష్ణ, శంకర్, వైసిపి మండల కోకన్వీనర్ పురుషోత్తమ రెడ్డి, చంద్రశేఖర్, నాయకులు తిమ్మప్ప, ప్రకాష్, నాయుడు, మోహన్, సోమన్నలు సమస్యను వివరించారు. కాంట్రాక్టర్లు, అధికారుల నిర్లక్ష్యం వల్లే నీరు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తయిన తర్వాత డిజైన్ మార్పు చేసి ఆదోని మండలంలోని అదనపు గ్రామాలకు నీరు అందించడం వల్లే సమస్య జఠిలంగా మారిందని పేర్కొన్నారు. డిజైన్‌లో లేని గ్రామాలను తొలగించి, ఉన్న గ్రామాలకు నీటిని సక్రమంగా సరఫరా చేయాలని కోరారు.

### మండగిరి ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పూర్తయ్యాక సమస్యను పరిష్కరిస్తాం

**- ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు**

మండగిరి ఎస్ఎస్ ట్యాంకు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చిన తర్వాత డిజైన్‌లో లేని అదనపు గ్రామాలను తొలగించి నీటి సమస్యను పరిష్కరిస్తాం. డిజైన్‌లో లేని గ్రామాలకు మండగిరి ఎస్ఎస్ ట్యాంకు ద్వారా నీటిని అందిస్తాం. కాంట్రాక్టర్లు, అధికారులు నీటిని సక్రమంగా అందించకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం.

### ఆస్పరి మండలానికి సక్రమంగా నీరందించాలి

**- హనుమంతు, సిపిఎం మండల కార్యదర్శి**



నాగనాథనహళ్లి నుంచి ఆస్పరి మండలానికి వచ్చే నీటిని సక్రమంగా అందించాలి. ఆదోనిలోని గ్రామాలకు ఇచ్చిన అక్రమ కనెక్షన్లను తొలగించి ఆస్పరికి సక్రమంగా నీటిని సరఫరా చేయాలి. లేకపోతే ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ముందు ఆందోళనకు పూనుకుంటాం.



చికిత్స కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన

## పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు సత్వర చికిత్స

**- చికిత్స కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్**

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులతో పాటు మానసిక, శారీరక ఎదుగుదలలేని పిల్లల కోసం జిల్లా సత్వర చికిత్స కేంద్రం ఏర్పాటు చేశామని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నేషనల్ హెల్త్ మిషన్ గ్రాంట్ కింద రూ.కోటి 6 లక్షల వ్యయంతో నిర్మించిన జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) ద్వారా 0 నుండి 18 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలను హెల్త్ స్క్రీనింగ్ చేసి పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులతో పాటు మానసిక, శారీరక ఎదుగుదల లేని వారిని ముందుగా గుర్తించి సంబంధిత పిల్లలను జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి రెఫర్ చేస్తే, జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో ఉండే వైద్యులు చిన్నారులను అక్కున చేర్చుకొని వారిని మామూలు స్థితికి తీసుకువచ్చేందుకు వైద్య సేవలు అందిస్తారన్నారు. పిల్లల జీవన నాణ్యతను మెరుగుపరుస్తారని కలెక్టర్ తెలిపారు. పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులతో పాటు మానసిక, శారీరక ఎదుగుదల లేని సమస్యలను వెంటనే గుర్తిస్తే వాటిని త్వరగా నయం చేయడమే జిల్లా సత్వర చికిత్స కేంద్రం ముఖ్య లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. పుట్టుకతో వచ్చే సమస్యలు పిల్లల మానసిక శారీరక ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. అలాంటి పిల్లలకు జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్) అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రామ్ అధికారి హేమలత, ఎపిఎంఎస్ఐడిసి అధికారులు పాల్గొన్నారు.

## కెజిబివిలో ప్రవేశం కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

కెజిబివి నిరుపేద విద్యార్థులకు చదువుకునేందుకు ప్రవేశం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప అబ్దుల్లా పేర్కొన్నారు. బుధవారం సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయ జ్యోతి కుమారికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరపున వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప అబ్దుల్లా మాట్లాడుతూ దేశంలోనే కర్నూలు జిల్లా అక్షరాస్యతలో చివరి స్థానంలో ఉందన్నారు. అందులోను ముఖ్యంగా మహిళా అక్షరాస్యతలో చాలా వెనుకబడి ఉందన్నారు. నిత్యం వలసలు వెళుతూ వాళ్ళ జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటే చాలా మంది విద్యార్థులకు సీట్లు రాకపోవడంతో విద్యార్థులు చదవడం మధ్యలోనే ఆపేసే పరిస్థితి ఉందన్నారు. ప్రతి ఒక్కరికి చదువుకునేందుకు ప్రవేశం కల్పించాలని వారు కోరారు. కర్నూలు జిల్లాకు కస్తూర్బా గాంధీ బాలికలల విద్యాలయాలలో అదనపు సీట్లు పెంచి విద్యార్థినిల చదువులను ప్రోత్సహించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా కెజిబివిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. నగర అధ్యక్ష కార్యదర్శులు అమర్‌సాయి, ఉదయ్, ఆర్యన్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ఎ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయజ్యోతి కుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



హైదరాబాద్‌లో ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారం అందుకుంటున్న బైలుప్పల షఫీవుల్లా

### బైలుప్పల షఫీవుల్లాకు ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారం ప్రదానం

**ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్**

నందమూరి మోహనకృష్ణ, నందమూరి రూప చేతుల మీదుగా కర్నూలుకు చెందిన కళాకారుడు బైలుప్పల షఫీవుల్లా ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారాన్ని హైదరాబాద్ లో అందుకున్నారు. తెలుగువారి ఆత్మగౌరవం విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా హైదరాబాద్ నగరంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నందమూరి వారసులతో పాటు టిడి జనార్ధన్, బిక్కీకృష్ణ, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నివాసి రంగస్థల కళా సేవకులు బైలుప్పల షఫీవుల్లాకు ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారాన్ని శాలువా కప్పి మేమెంటో ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలలో వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించిన నిష్ణాతులకు పురస్కారాలు అందజేశారు. ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారాల ప్రదానోత్సవానికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి చంద్రకుమార్, ఎమ్మెల్సీ టిడి. జనార్ధన్, తిరుపతి ఎస్‌వి యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్ కొలకలూరి ఇనాక్, ప్రముఖ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి, తదితర ప్రముఖులు హాజరై ఎన్‌టిఆర్ జీవిత విశేషాలపై పుస్తకాలపై సమీక్ష జరిపారు. నందమూరి మోహనకృష్ణ సభలో మాట్లాడుతూ తన తండ్రి నిరంతరం ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. బడుగు బలహీనవర్గాల పక్షపాతి, మహిళల పట్ల ప్రత్యేక గౌరవం చూపేవారన్నారు. ఎన్‌టిఆర్ మనవరాలు నందమూరి రూప మాట్లాడుతూ తాతగారు తెలుగుజాతి ఆత్మగౌరవం దశదిశల వ్యాపింపజేసిన మహా రుషి అని నేటి యువతరానికి ఆదర్శమని అన్నారు. జాతీయస్థాయిలో ఉభయ రాష్ట్రాల నుండి విచ్చేసిన సమాజ సేవకులకు కళాశాలలకు ప్రజా సేవకులకు ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారాలను కమిటీ సభ్యులు అందజేశారు.

### ఇంటర్ సప్లిమెంటరీ లో విద్యార్థి డిబార్

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలో కర్నూలు నగరంలోని బికాంప్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మాస్ కాపీకి పాల్పడిన విద్యార్థిని డిమాండ్ చేసినట్లు ఆర్ఐఒ గురువయ్య శెట్టి బుధవారం వెల్లడించారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించగా 8780 మంది విద్యార్థులుకు గాను 8344 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు. 436 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం3076 విద్యార్థులకు గాను 2919 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పేర్కొన్నారు. 157 మంది విద్యార్థులు మాత్రమే గైర్హాజరయ్యారన్నారు.

## నష్టపరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

### కొందరి రైతులకే నష్టపరహారం జమ

**ప్రజాశక్తి-పత్తికొండ**

2023-24 ఖరీఫ్ సీజన్లో పంట వేసి నష్టపోయిన రైతులు పంట నష్టపరిహారం కోసం ఎదురుచూపులు తప్పడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతుల ఖాతాలకు పంట నష్ట పరిహారం జమ చేస్తూ బటన్ నొక్కారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పంట నష్టపరిహారం వాయిదా పడింది. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. పత్తికొండ మండల గ్రామీణ ప్రాంతాలలో కొన్ని వేల ఎకరాలలో సజ్జా, పత్తి ,వేరుశనగ, ఉల్లి, ఆముదం, టమోటా ,మిరప తదితర పంటలను రైతులు సాగు చేశారు. పత్తికొండ మండలానికి రూ.17 కోట్ల 46 లక్షలు పంట నష్టపరిహారం నిధులు మంజూరయ్యాయని అధికారులు వెల్లడించారు.

ఈనెల 17, 18వ తేదీల్లో రైతుల ఖాతాల్లోకి పంట నష్టపరిహారం జమ కావడం మొదలైంది. కొందరి రైతులకు మాత్రమే పరిహారం జమ అయ్యింది. మిగతా రైతులు జమ కాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు సాగు చేయడానికి వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వర్షాలు రాక వేసిన పంట చేతికి రాక చేసిన అప్పులు తీర్చలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట పరిహారంతో చేసిన అప్పులు తీర్చుకుందాం అనుకున్న లోపే అకౌంట్లో జమ కాకపోవడంతో రైతులు తీవ్రంగా మనస్తాపం చెందుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి సకాలంలో నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.

**రైతులు అధైర్య పడొద్దు: పత్తికొండ ఎఒ వెంకట రాముడు**



ఈనెల 30 తేదీలోపు ప్రతి రైతుకు పంట నష్టపరిహారం బ్యాంకు అకౌంట్‌లో జమవుతుంది. ఏ రైతు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 30 తర్వాత జమ కాకపోతే పొలానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను రైతు భరోసా అధికారులకు అందజేయాలి. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహార అందే విధంగా చర్యలు తీసుకుంటాం.

**బ్యాంకు చుట్టూ తిరుగలేను**

**రైతు మునిస్వామీ- అగ్రహారం ,పత్తికొండ మండలం**



రెండు ఎకరాలో పత్తి పంట సాగు చేశాను. సరైన వర్షాలు లేక వేసిన పత్తి పంట చేతికి రాలేదు. నష్ట పరిహారం మంజూరు అయిందని అధికారులు చెబుతున్నారు. రైతు భరోసా అధికారిని అడిగితే సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బ్యాంకుకు వెళితే నష్ట పరిహారం పడలేదని చెబుతున్నారు.

**నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలి**

**ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దియ్య గౌడ్**



ప్రతి రైతుకు పంట నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలి. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని సకాలంలో నిలబెట్టుకోవాలి. సకాలంలో జమ కాకపోతే రైతులను కలుపుకొని ధర్నా చేపడతామని హెచ్చరించారు.

## సౌడుమట్టి తరలించొద్దంటున్న పోలీసులు

**-పేద రైతులను భయాందోళనకు గురి చేస్తున్న పోలీసులు**

**-ట్రాక్టర్ యజమానులపై పోలీసుల కొరడా**

**క్రిష్ణగిరి- ప్రజాశక్తి**

క్రిష్ణగిరి మండలం చుంచు ఎర్రగుడి గ్రామంలో వందల సంఖ్యలో పేద రైతులు మట్టి మిద్దెలలో నివాసం ఉంటున్నారు. వర్షాకాలంలో వర్షాలు ఎక్కువగా కురిస్తే మిద్దెలపై ఉన్నటువంటి మట్టి నీటిలో కొట్టుకుని పోయి మట్టి(సౌడు) మిద్దెలు అన్ని రంధ్రాలు పడి నీరు కారే పరిస్థితి ఉంది. ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాలకు సౌడు మిద్దెలు రంధ్రాలు పడ్డాయి. పేద రైతులు వర్షం పడిన ప్రతిసారి సౌడు మట్టి మిద్దెలు ఎక్కడ కూలిపోతాయో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి సౌడు మట్టి మిద్దెలకు ప్రతి సంవత్సరం కూడా మిద్దెలపై కచ్చితంగా సౌడుమట్టిని పోయాలి. కొంతమంది పేద రైతులు తమ సౌడుమట్టి మిద్దెలపై నింపుకొనుటకు ఎద్దుల బండ్లు వ్యవసాయ కూలీలు అందుబాటులో లేని కారణంగా సౌడుమట్టి మిద్దెలు కలిగిన వారంతా ఏకమై ట్రాక్టర్లు జెసిబిని పిలిపించుకొని మట్టిని సేకరిస్తున్నారు. గ్రామంలో కొంతమంది పెత్తందారులు కావాలని రైతులపై కక్షగట్టి, మాకు తెలియకుండా ఎవరే కానీ ఏది చేయకూడదని ఒకవేళ ఏదైనా పని చేసుకోవాలని అనుకుంటే తనకు ముడుపులు ఇచ్చి తర్వాత పనులు చేసుకోవాలంటునానరు. అలా లేని పక్షంలో పోలీసులను పిలిపించి లేదా పోలీస్ స్టేషన్లో వారిపై అక్రమ కేసులు బనాయించి వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుంటారు. లేదా గ్రామంలో అల్లర్లు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ ఉంటారు. అలాంటి పెత్తం దారులు సౌడుమట్టిని తోలుకుంటున్న సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తే ఆ పెత్తందారుడు చెప్పిందే వేదంగా భావించే కృష్ణగిరి పోలీసులు హుటాహుటిన వచ్చి ట్రాక్టర్ తాళాలు తీసుకుని జెసిబి తాళాలు తీసుకుని రైతులను బెదిరిస్తూ సౌడుమట్టిని తోలుకోకపోతే ఏ క్షణాన ఇల్లు కూలిపోయి చనిపోతామో అని భయంగా ఉంది సార్ అని ప్రాధేయపడినా వారిని లెక్కచేయరు. పేద రైతులను ఇబ్బందులకు గురి చేస్తూ వారి సౌడుమట్టి మిద్దెలకు మట్టిని తరలించకుండా నిలిపేస్తున్నారు. పోలీసుల తీరుపై పేద రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చుంచుఎర్రగుడి గ్రామంలో ఒక పెత్తందారుడు చేస్తున్న అక్రమాలు, భూకబ్జాలు ,అక్రమ ఇసుక తరలింపులు , మద్య రవాణా ఇవేవీ పోలీసు వారికి కనిపించవని, ఎందుకంటే వారికి ప్రతి నెల ముట్టాల్సిన ముడుపులు ముడుతున్నాయనే ఆరోపణలున్నాయి. పోలీసులు మానవతా దృక్పదంతో ఆలోచించి... పేద రైతుల ఇళ్లకు సౌడు మట్టిని తరలించుకోవడానికి అవకాశం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సౌడుమట్టి క్వారీ వద్ద పేద రైతులు

### వంట ఏజెన్సీ నిర్వాహకులకు పోటీలు

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**



మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు ఆహారాన్ని తయారు చేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులకు బుధవారం కల్లూరులో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపుగా 12 వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసులు, వనజ కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహించామన్నారు. విజేతలకు బహుమతులు , పాల్గొన్నవారందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రూ 2.6 కోట్లు ఇన్పుట్ సబ్సిడీ మంజూరు

**ప్రజాశక్తి-తుగ్గలి** : తుగ్గలి మండలంలోని రైతులు రబీ -2023-24 సంవత్సరంలో పంటలు సాగు చేసి నష్టపోయిన 2087 మంది రైతులకు రూ.2.6 కోట్లు ప్రభుత్వం ఇన్పుట్ సబ్సిడీ మంజూరు చేసిందని వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తుగ్గలిలో విలేకరులతో మాట్లాడుతూ పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించామన్నారు. అందువల్ల ఈ జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే 2 రోజుల లోపు రైతులు మీ రైతు భరోసా కేంద్రంలో తెలియజేయాలని ఆయన రైతులకు సూచించారు.



### తాగునిటీ పరిష్కారానికి ఇఒఆర్‌డి తక్షణ చర్యలు

**ప్రజాశక్తి- సి బెళగల్**

మండలంలోని గొల్లలదొడ్డి గ్రామానికి తాగునిటీ పరిష్కారంలో భాగంగా ఇఒఆర్‌డి సందీప్ బుధవారం తక్షణ చర్యలు చేపట్టారు. ఇటీవల ఈదురు గాలులకు తాగునిటికి సంబంధించిన విద్యుత్ స్తంభాలు విరిగి పడి గ్రామానికి తాగునిటీ అంతరాయం ఏర్పడింది. సర్పంచి రామలింగమ్మ సమక్షంలో విద్యుత్ అధికారుల మరమ్మతులతో పరిస్కారానికి దృష్టి సారించారు. ఎట్టకేలకు నీటిని అందించడంతో గ్రామస్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం బురాన్ దొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లో సచివాలయాలను తనిఖీ చేశారు. వేళలు పాటించి ప్రజలకు అవసరమైన, సులువైన సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు.

## సబ్సిడీ విత్తనాలు అందించాలి

### - రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మండలంలోని ప్రతి రైతుకూ తక్షణమే సబ్సిడీ విత్తనాలు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, పాండవగల్లు సర్పంచి కె.ఉమాదేవి డిమాండ్ చేశారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదోని ఎడిఎ బలవర్ధిరాజు, ఎఒ అశోక్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తక్షణమే సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అదనంగా తెప్పించి రైతులకు పంపిణీ చేయాలని కోరారు. పంట నష్ట పరిహారం రైతులందరి ఖాతాకు జమ చేయాలని, రైతు భరోసా, కిసాన్ సమ్మాన్ రైతుల ఖాతాలోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. పత్తి విత్తనాలను అధిక ధరలకు అమ్ముతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, మండల నాయకులు మునిస్వామి, తిక్కన్న పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు : ఎడిఎ

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**



తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదోని ఎడిఎ బి.బాలవర్ధిరాజు, ఎఒ అశోక్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. శ్రీదీప్తి ట్రేడర్స్‌లో రికార్డులు సరిగా లేనందున మొత్తం రూ.34,85,082 విలువైన పత్తి, మిరప, కంది విత్తనాల అమ్మకాలు నిలిపేశారు. జయలక్ష్మి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్‌లో రూ.7,13,562 విలువ గల పత్తి విత్తనాల అమ్మకాలను నిలిపేశారు. అలాగే భువనేశ్వరి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, హైటెక్ ఆగ్రో ఏజెన్సీస్‌లో పత్తి విత్తనాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ సందర్భంగా ఎడిఎ బాలవర్ధిరాజు మాట్లాడుతూ... పత్తి, ఏదైనా విత్తనాలు కొనేటప్పుడు లైసెన్స్ కలిగి ధ్రువీకరించిన డీలర్ వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. బిల్లు తప్పకుండా తీసుకోవాలని, బిల్లులో లాట్ నెంబర్ కచ్చితంగా ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. మండలానికి 160 పత్తి విత్తన నమూనాలను లక్ష్యంగా ఇచ్చినట్లు చెప్పారు. ఇందులో 80 నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. 125 హెచ్‌డి శాంపిల్స్ కోసం కిట్లు ఇచ్చామని చెప్పారు. 25 రకాలైన పత్తి విత్తనాలను హెచ్‌డి టెస్ట్ చేసినట్లు తెలిపారు.

## బుడదొడ్డికి ఘన నివాళి

**ప్రజాశక్తి - కౌతాళం**



నివాళులర్పిస్తున్న నాయకులు

గుండెపోటుతో మృతి చెందిన టిడిపి నాయకుడు బుడదొడ్డికి టిడిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం బుడదొడ్డి మృతదేహంపై పార్టీ కండువా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి, సోదరుడు రామకృష్ణా రెడ్డి, సురేష్ నాయుడు, వెంకటపతి రాజు, సతీష్ నాయుడు మాట్లాడారు. బుడదొడ్డి చాలా ఏళ్ల నుంచి పార్టీ అభివృద్ధి కోసం పాటుపడినట్లు పేర్కొన్నారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉండి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. మండలంలోని సీనియర్ నాయకులు రామలింగన్న, సిద్ధప్ప, టిప్పు సుల్తాన్, కురువ వీరేష్, ఈరన్న, నాగిరెడ్డి, మల్లయ్య, ముకన్న, జనసేన నాయకులు రామాంజిని, చిన్న సిద్ధయ్య, మహాదేవ, మాలపల్లి లక్ష్మయ్య, మహంతేష్, శివ చుడి, నరసప్ప పాల్గొన్నారు.

## శ్రీమఠంలో హుండీ లెక్కింపు పూర్తి

**ప్రజాశక్తి - మంత్రాలయం**

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం లెక్కింపు పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేసిన ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అధికారులు, శ్రీమఠం అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి లెక్కించినట్లు తెలిపారు. మే నెలకు సంబంధించిన 29 రోజుల హుండీ ఆదాయం రూ.2,93,11,306, బంగారం 136 గ్రాములు, వెండి 1510 గ్రాములు వచ్చినట్లు చెప్పారు.

# సామాజిక వృత్తుల భద్రత కోసం ఉద్యమం

### - కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

సామాజిక వృత్తుల బతుకు భద్రత కోసం ఉద్యమించాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. బుధవారం పట్టణంలోని శివ సర్కిల్ వద్ద ఉన్న కెవిపిఎస్ కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు మాట్లాడారు. రెండున్నర నెలల పాటు జరిగిన ఎన్నికల హడావిడి వేడి పుట్టించినా జులై 4కు సంపూర్ణంగా తగ్గి ఎవరో ఒకరు అధికార పీఠాన్ని అధిరోహిస్తారని తెలిపారు. ఎవరు అధికారంలోకి వచ్చినా దళితుల సమస్యల పట్ల వారికుండే ప్రేమ, పరిష్కారాన్ని బట్టి పోరాటాన్ని ఎంచుకోవాలని చెప్పారు. సమాజానికి అనేక రకాలుగా ఉపయోగపడుతున్న సామాజిక వృత్తులైన డప్పు, చర్మం, కాటికాపరి, సఫాయి, తుంబుర, ఉరుము లాంటి వాటిని వృత్తులుగా ఎంచుకుని పని చేసే వారి సమస్యల పరిష్కారం కోసం పాలక వర్గాల కృషి నామ మాత్రంగానే ఉందన్నారు. సామాజిక వృత్తిదారులందరినీ ఐక్యం చేసి ఉద్యమించాలని కోరారు. రంగాల వారీగా వారు ఎదుర్కొనే సమస్యలపై చర్చించి ఉద్యమించేందుకు జూన్ 15న డప్పు కళాకారుల సమావేశం కర్నూలులో, జూన్ 17న కాటికాపరుల సమావేశం ఆదోనిలో, జూన్ 19న చర్మకార వృత్తిదారుల సమావేశం ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక వృత్తిదారులంతా హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కరుణాకర్, కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, స్కావెంజర్స్ కార్మిక హక్కుల పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆంద్రా గురుస్వామి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్ష, సహాయ కార్యదర్శులు బి.తిక్కప్ప, హెచ్.చిన్నమారయ్య, ఎం.భాస్కర్, మామిడికాయల రాజు, ఆర్.పెద్దబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ



చిప్పగిరిలో వంట ఏజెన్సీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## విద్యార్థులు మెచ్చే రీతిలో భోజనం ఉండాలి : ఎంఇఒ

**ప్రజాశక్తి - చిప్పగిరి**

విద్యార్థులు మెచ్చే రీతిలో రుచికరమైన భోజనం అందించాలని ఎంఇఒ బాల నాయుడు వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అందించే వంట ఏజెన్సీ సభ్యులకు చిప్పగిరి ఎంఆర్‌సి భవనంలో ఎంఇఒ బాలనాయుడు ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థులకు ఏ రకంగా భోజనం అందించాలనే గైడ్‌లైన్స్ ప్రకారం మెనూ అందించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్నందున మధ్యాహ్న భోజన పథకాన్ని కొన్ని నూతన మార్పులతో కొత్త మెనూ ప్రకారం చేయాల్సి వస్తుందని తెలిపారు. దాని ప్రకారమే విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని కోరారు. సిఆర్‌పి శీను, ఎంఐఎస్ నెట్టికల్లు, వంట నిర్వాహకులు గురుదాసు, శివలింగ, రాఘవేంద్ర, కాంతమ్మ పాల్గొన్నారు.

**పెద్దకడబూరు :** మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనమందించాలని ఎంఇఒ రామమూర్తి తెలిపారు. బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు, కార్మికులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్స్ శివకుమార్, రజియాలు పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఎలా తయారు చేయాలో, పరిసరాలను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో వివరించారు. అనంతరం ఎంఇఒ రామమూర్తి మాట్లాడారు. విద్యార్థులకు అందించే భోజనం తయారీలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, నాణ్యమైన సరుకులను వాడి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఎంఐఎస్ కో ఆర్డినేటర్ లక్ష్మన్న, సిఆర్‌పి లక్ష్మన్న, అకౌంటెంట్ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.



పెద్దకడబూరులో మాట్లాడుతున్న ఎంఇఒ రామమూర్తి

## నేటి నుంచి భక్తయోగాంజనేయ స్వామి ఉత్సవాలు

**ప్రజాశక్తి- దేవనకొండ**

మండల పరిధిలోని పి.కోటకొండ గ్రామంలో కొలువైన శ్రీభక్తయోగాంజనేయ స్వామి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు యోగేశ్వర రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో కలశ స్థాపన, హోమాలు, జపములు, తీర్థప్రసాదాలు, జూన్ 1న రథోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

**1 నుంచి అండర్-19 కబడ్డీ పోటీలు**

భక్త యోగాంజనేయ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఓపెన్ టు ఆల్ అండర్-19 కబడ్డీ పోటీలు జూన్ 1 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు దస్తగిరి గౌడ్, దేవేంద్ర గౌడ్, హరికృష్ణ తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఈనెల 31లోపు ప్రవేశ రుసుం రూ. 400 చెల్లించాలన్నారు. గెలుపొందిన జట్లకు మొదటి, రెండు, మూడు, నాలుగో బహుమతుల కింద రూ. రూ.12 వేలు, రూ.7 వేలు, రూ.3,500, రూ.2వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న జట్లు 7671865023, 9959093866 సెల్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## సమ్మర్ క్యాంపులతో ప్రయోజనం

### - ముఫ్తి ఆసిఫుద్దీన్ ఖాద్రీ

**ప్రజాశక్తి - ఆదోని**

విద్యార్థులు అనారోగ్యానికి, ప్రమాదాలకు గురికాకుండా సమ్మర్ క్యాంపులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని ముఫ్తి ఆసిఫుద్దీన్ ఖాద్రీ, కౌన్సిలర్ ఉస్మాన్ బాష, సీనియర్ జర్నలిస్టు హుస్సేన్ బాష తెలిపారు. బుధవారం ఆదోనిలోని ఖానిమొహల్లా సయ్యద్ నూరి మదరసాకు చెందిన 70 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని నమాజ్ ప్రాముఖ్యత, నమాజ్ పద్ధతులతోపాటు సూరాలు నేర్పించారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. హఫీసాబ్, తురాబ్, షబ్బీర్, షఫీ పాల్గొన్నారు.



విద్యా సామగ్రి అందజేస్తున్న సభ్యులు



క్రీడాకారులను అభినందిస్తున్న విట్టా రమేష్

## క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం

### - ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ నాయకులు

**ప్రజాశక్తి - ఆదోని**

క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించి వారి ఎదుగుదలకు సహాయ, సహకారాలు అందిస్తామని తాలూకా క్రికెట్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఆదోని పట్టణానికి చెందిన బి.సంజన, వై.మేఘన అండర్-19, 15 విభాగాలకు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టా రమేష్, ఉపాధ్యక్షులు ముజీబ్, కార్యదర్శులు బి.వెంకటేష్, కంబిరెడ్డి తెలిపారు. బుధవారం ఆదోనిలోని కార్యాలయంలో కలిసిన విద్యార్థులను అభినందించారు. కోచ్ వై.బాలాజీ రావు, సభ్యులు కె.నారాయణ క్రీడాకారులను అభినందించారు. నెల్లూరులోని వెంకటగిరిలో జూన్ 1 నుంచి 13 వరకు జరిగే అంతర్ జిల్లా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్, ఆర్ట్స్ కళాశాల మేనేజ్‌మెంట్ తరఫున సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.

## దేవర ఉత్సవాల్లో విరుపాక్షి

**ప్రజాశక్తి - ఆలూరు**

హాలహర్వి మండలం చింతకుంట గ్రామంలో కొలువైన కంచమ్మ, మదగమ్మ దేవతల దేవర ఉత్సవాల్లో బుధవారం వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.విరుపాక్షి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బళ్లారి జిల్లా మోకా నియోజకవర్గంలోని బసరకోడు గ్రామంలో సుంకులమ్మ, మారెమ్మ దేవతల దేవర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేవరలు కుల, మతాలకతీతంగా నిర్వహించుకుంటారని తెలిపారు. చింతకుంట కంచమ్మ దేవాలయం పునఃనిర్మాణం కోసం రూ.30 వేల విరాళం అందించారు. అనంతరం వైసిపి మండల నాయకులు హర్దగేరి శ్రీనివాసులు, బాలరాజు, మండల కన్వీనర్ రామిరెడ్డి, తిప్పారెడ్డిలు ఆయన శాలువా వేసి, పూలమాలతో సన్మానించారు. వైసిపి నాయకులు ఓబులేసు, లోకనాథ్, హనుమంతు రెడ్డి, రాముడు పాల్గొన్నారు.



దేవరలో పాల్గొన్న విరుపాక్షి



# ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఉన్న మొదటి లైన్ వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. విద్యుత్ తీగలు, ఫీజు బాక్సులు చేతికందే ఎత్తులోనే ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ఈ రోడ్డు గూండా పట్టణంలోని వీవర్స్ కాలనీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వైష్ణవి డిగ్రీ కళాశాలకు విద్యార్థులు వెళ్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ గతంలో ఏర్పాటు చేసిన రక్షణ వలయం ధ్వంసమయింది. అసలే వర్షాకాలం.. విద్యుత్ ప్రమాదాలు జరగడానికి ఎక్కువగా అవకాశాలు ఉన్నాయి. సంబంధిత విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కొత్త రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**అధికారులు వెంటనే స్పందించాలి**

**- గోవిందు, సిపిఎం సీనియర్ నాయకులు**

వర్షాకాలం ప్రారంభం అవుతోంది. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ నూతన రక్షణ వలయం ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలి.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

## నేడు లక్ష్మమ్మవ్వ రథోత్సవం

### - విద్యుద్దీపాలతో అలంకరించిన ఆలయం

### - ఆలయ ధర్మకర్త రాచోటి రామయ్య

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ రథోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రాచోటి రామయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. 92వ వెండి రథోత్సవం సందర్భంగా నేడు ఆలయంలో తెల్లవారుజామున అవ్వ సమాధి, మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం, పూల అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని తెలిపారు. ఉదయం 10 నుంచి 2 గంటల వరకు అన్నదానం ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి అవ్వ విగ్రహాన్ని వెండి రథోత్సవంలో ఉంచి పురవీధుల్లో గుండా రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బారికేడ్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. శ్రీమహాయోగి లక్ష్మమ్మ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు యోగా సాధన, ధ్యానం, కూచిపూడి నాట్యం, సంస్కృతి, సత్సంగ, సంగీతం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. చుట్టుపక్కన ఉన్న గ్రామాలతో పాటు కొత్తగా పెళ్లయిన జంటలు అవ్వని దర్శించుకుంటారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా డీఎస్పీ శివ నారాయణస్వామి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారని చెప్పారు.



మాట్లాడుతున్న ధర్మకర్త రాచోటి రామయ్య

### స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం

# పంట రుణాలివ్వాలి

### - కొత్త పంట రుణాలు మంజూరు చేయాలి - రైతుసంఘం, వ్యకాస డిమాండ్

**ప్రజాశక్తి -దేవనకొండ**

ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనుల నిమిత్తం రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, నూతన పంట రుణాలు, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని, రుణమాఫీ అమలు చేయాలని రైతుసంఘం, వ్యకాస నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దేవనకొండ, తెర్నేకల్లు, కోటకొండ గ్రామాల్లోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దేవనకొండ బ్యాంకు దగ్గర అశోక్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, రైతు సంఘం మండల కార్యదర్శి సూరి, వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా, రైతు సంఘం నాయకులు శ్రీరాములు మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలైన నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనుల కోసం, పెట్టుబడుల నిమిత్తం ప్రభుత్వ, ప్రయివేట్ బ్యాంకులు, ప్రయివేట్ వ్యక్తుల దగ్గర అప్పు కోసం ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న మందులు, ఎరువులు, విత్తనాలు ధరలు రైతులకు భారమవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ బ్యాంకులు మాత్రం రెన్యువల్‌కే పరిమితమవుతూ రైతులకు వ్యవసాయానికి సహాయం చేయడంలో ముందడుగు వేయడం లేదని తెలిపారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడులకు సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని కోరారు. రైతులను ప్రయివేట్ బ్యాంకుల్లో, ప్రయివేట్ వ్యక్తుల నుంచి కాపాడాలని, కొత్త పంట రుణాలు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజాసంఘాల నాయకులు యూసుఫ్ బాషా, గాజుల శ్రీనివాసులు, కెపి.రాముడు, అస్లాం బాష, కౌలుట్ల, లక్ష్మిరెడ్డి, గోవిందు, నారాయణ, రంగన్న, మురళీ పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు



కౌతాళంలో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

## గొడవలకు దిగితే కఠిన చర్యలు : డీఎస్పీ

**ప్రజాశక్తి - కౌతాళం**

గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన హాల్విలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఫ్యాక్షన్ గ్రామంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో, వివిధ కేసుల్లో ఉన్న వ్యక్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల లెక్కింపు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామమైన హాల్విలో అన్ని పార్టీలకు చెందిన అనుమానిత ఇళ్లలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి, సోదాలు చేపట్టినట్లు చెప్పారు. ఎలాంటి గొడవలకూ వెళ్లవద్దని కోసిగి సిఐ జి.ప్రసాద్, కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి హెచ్చరించారు. పెద్దకడబూరు, కోసిగి ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు : సిఐ

**ప్రజాశక్తి :- గోనెగండ్ల**

ఎన్నికల ఫలితాల రోజు నిబంధనలను అతిక్రమించి అల్లర్లకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు తప్పవని గోనెగండ్ల సిఐ రామకృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం గోనెగండ్ల పోలీసు స్టేషన్ ఆవరణలో మండలంలోని అన్ని గ్రామాల్లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ఫలితాల రోజు ప్రతి ఒక్కరూ ఇళ్లలోనే కూర్చొని టివిల్లో ఎన్నికల ఫలితాలను వీక్షిస్తూ ఆస్వాదించాలని తెలిపారు. ఎవరికైనా శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటే ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. బయటకు వచ్చి గుంపులుగా రోడ్లపై తిరగడం, ర్యాలీలు, ప్రదర్శనలు చేపట్టడం, బాణసంచా కాల్చడం చేయరాదని సూచించారు. చట్టాన్ని అతిక్రమించి బయటకొచ్చి గుంపులుగా తిరిగినా, ఇతరులను రెచ్చగొట్టినా, కవ్వింపులకు దిగినా వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ రామకృష్ణయ్య



కేదార్‌నాథ్‌లో ఉన్న వీరేష్

### రాఘవేంద్ర రెడ్డి గెలవాలని

## కేదార్ నాథ్‌లో పూజలు

**ప్రజాశక్తి - మంత్రాలయం**

టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి గెలవాలని కేదార్ నాథ్‌లో పూజలు నిర్వహించినట్లు ఆయన అభిమాని తెలిపారు. బుధవారం ఆయన ఫోన్ ద్వారా మాట్లాడారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన పోలి వీరేష్ కేదార్ నాథ్ వెళ్లిన సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి బ్యానర్‌ను అక్కడ ప్రదర్శించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాఘవేంద్ర రెడ్డి గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆలయంలో రాఘవేంద్ర రెడ్డి పేరుతో ప్రత్యేక పూజలు చేయించినట్లు తెలిపారు.

### ఇంటర్ విద్యార్థులకు

## నర్సింగ్‌లో మంచి అవకాశం

### - ఆర్ఎస్ నర్సింగ్ కళాశాల డైరెక్టర్ శివ రాముడు

**ప్రజాశక్తి - ఆదోని**



ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు నర్సింగ్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని ఆర్ఎస్ నర్సింగ్ కళాశాల మేనేజ్‌మెంట్, డైరెక్టర్ శివ రాముడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరేష్ ఆచారి తెలిపారు. బుధవారం ఆదోనిలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని ఆర్ఎస్ నర్సింగ్ కళాశాలలో వారు మాట్లాడారు. కలలను నెరవేర్చుకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లకుండా వైద్య రంగంలో స్థిరపడే వారికి ఆదోనిలోనే అవకాశాలు తీసుకొచ్చామన్నారు. తమ కళాశాలలో జిఎన్ఎం, జనరల్ నర్సింగ్, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఉచిత సీట్లకు ముందుగానే రిజర్వేషన్ చేసుకున్న వారికి ఇస్తామని చెప్పారు. ఈ కోర్సులను పూర్తి చేయడం వల్ల దేశ, విదేశాల్లో అపారమైన ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. మండల, గ్రామ కేంద్రాల్లో ఆర్ఎంపి, ఆర్‌టిసి, రైల్వే, ఈఎస్ఐ, 108, 104లో ఎక్కువ అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక హెల్త్ కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లలో త్వరగా స్థిరపడే అవకాశం ఉంటుందని అన్నారు. ఇతర వివరాలకు 7702894254 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## ఆదోనిలో కార్డెన్ సెర్చ్

**ప్రజాశక్తి - ఆదోని**



సోదాలు చేస్తున్న పోలీసులు

ఆదోని వన్‌టౌన్ పరిధిలోని వాల్మీకి నగర్, బోయగేరి ఏరియాల్లో డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆదేశాల మేరకు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ట్రైనీ డీఎస్పీ శ్రీధర్ ధీరజ్ తెలిపారు. తనిఖీలో 30 లీటర్ల సారా, రికార్డులు లేని 43 వివిధ వాహనాలు సీజ్ చేశామన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో రిటైల్ పెట్రోల్, డీజిల్ షాపు యజమానులు ఎన్నికల ఫలితాలు వెల్లడించే వరకు లూజు అమ్మకాలు చేపట్టరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. వన్ టౌన్ సిఐ తేజ మూర్తి, పోలీసులు ఉన్నారు.